ప్రొటోకాల్‌కు కూటమి ప్రభుత్వం తూట్లు

● శిలాఫలకాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు స్థానం కల్పించని వైనం
● జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మసీదుపురం సర్పంచ్


పూర్తిస్థాయిలో సభ్యులు హాజరుకాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మహానంది: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చేసిందే చట్టం అనేలా చేస్తున్నారు. నిబంధనల మేరకు పాటించాల్సిన ప్రొటోకాల్ సైతం పాటించకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తుండటం విమర్శలకు దారి తీస్తోంది. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే శిలా ఫలకాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధుల పేర్లు లేకుండా, ఎలాంటి పదవుల్లేని అధికార పార్టీకి చెందిన వారి పేర్లు వేయించుకోవడం విమర్శలకు తావిస్తోంది.

మహానంది మండలం మసీదుపురం గ్రామంలో మార్చి 8న నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంలో గ్రామ సర్పంచ్ కాకనూరు లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మునగాల మల్లికార్జునరెడ్డిల పేర్లు లేవు. కానీ ఎలాంటి పదవుల్లేని అధికార పార్టీ నేత, నామినేటెడ్ పదవులున్న వారి పేర్లు మాత్రమే రాయించడం విమర్శలకు దారి తీసింది. దీంతో గ్రామ సర్పంచ్ లక్ష్మీరెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజకుమారి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలకు దక్కని ఆహ్వానం

బుక్కాపురం గ్రామంలో ఈనెల 4న శుక్రవారం రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా వ్యవసాయ యంత్ర పరికరాలైన గొర్రు, గుంటక, తైవాన్ స్ప్రేయర్లు, రోటావేటర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీ నరసమ్మ, గ్రామ సర్పంచు కందుల వరలక్ష్మమ్మలకు ఎలాంటి ఆహ్వానం దక్కలేదు. వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడంతోనే పిలవలేదన్న విమర్శలున్నాయి. కేసీ కెనాల్ ప్రాజెక్ట్ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి చేత పంపిణీ చేయించారు. మరిచిపోయామని అధికారులు చెప్పడం గమనార్హం.

మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు గైర్హాజరు

కూటమి ప్రభుత్వం కుట్రల్లో భాగంగా తమకు గౌరవం ఇవ్వడం లేదన్న మనస్తాపంతో మంగళవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశానికి ఏ ఒక్క ఎంపీటీసీ హాజరు కాలేదు. కేవలం ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11 గంటలు దాటినా ఎవరూ హాజరుకాకపోవడంతో సమావేశాన్ని బుధవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్ దౌలా ప్రకటించారు.

క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు


ప్రత్యేక పూజల అనంతరం కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

భ్రామరికి కొబ్బరి కాయల సమర్పణ


అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పిస్తున్న ఆలయ ఉద్యోగి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి మంగళవారం కొబ్బరికాయలు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి, పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించారు. కార్యక్రమంలో స్వామివారి ఆలయ పర్యవేక్షకులు ఎం.హరియానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కడపకు చెందిన సాయి నటరాజ నృత్య అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మహాగణపతిం, మూషికవాహన, శివశివశంకరా, నమశ్శివాయ, అమ్మపరమేశ్వరి, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు తిరుపతి, విజయబాబు, రాజశేఖర్, శశికళ తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి

వెలుగోడు: పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జైపాల్, ఈఓఆర్‌డీ మురారి, పంచాయతీ కార్యదర్శి సుంకన్న పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం


మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని మున్సిపల్ కమిషనర్ బేబి సూచించారు. మంగళవారం సంతపేట స్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కమిషనర్, ఎంఈఓలు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 సుభాన్, ఎంఈఓ-2 శ్రీనివాసులు, స్కూల్ హెచ్‌ఎం నారాయణ స్వామి, విద్యా కమిటీ చైర్మన్ సాదీ చాంద్, పూర్వ విద్యార్థి అల్వాల రామ్మూర్తి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

జూపాడుబంగ్లా: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ సభా ఆశావర్కర్లకు సూచించారు. మంగళవారం ఆశాడేను పురస్కరించుకుని పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాల ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సభా మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున గ్రామాల్లోని వ్యవసాయ కూలీలు అధికసమయం ఎండల్లో తిరగకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికి వెళ్లి రోగగ్రస్తుల వివరాలను సేకరించి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయలక్ష్మమ్మ, రాముడు పాల్గొన్నారు.

సామరస్యంగా పరిష్కరించుకోవాలి


దారి వేయిస్తున్న డీఎస్పీ, తహసీల్దార్

నందికొట్కూరు: పొలాలకు వెళ్లే రస్తా పంచాయతీలను సామస్యంగా పరిష్కారం చేసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయులు నాయక్ సూచించారు. మంగళవారం మిడుతూరు మండల పరిధిలోని మాసాపేట పొలిమేరలోని ఆర్‌సీఎం చర్చి(కల్వకొండ) వద్ద దిగువపాడు రైతులు పొలాలకు వెళ్లడానికి దారి విషయంలో 10 రోజుల నుంచి జరుగుతున్న సమస్యను తహసీల్దార్ శ్రీనివాసులు, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యంతో కలిసి డీఎస్పీ ఇరువర్గాలతో చర్చించి, ఒప్పించి పరిష్కారం చేశారు. బందోబస్తు మధ్య దిగువపాడు రైతులు పొలాలకు వెళ్లేందుకు మట్టితో దారి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలాలకు వెళ్లే దారుల విషయంలో ఎలాంటి గొడవలకు తావులేకుండా పరిష్కారం చేసుకోవాలన్నారు. ఈయన వెంట ఎస్‌ఐ ఓబులేసు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్‌లో పొందుపరచాలి

● డీఎస్పీ రామాంజినాయక్


మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

ఆత్మకూరు: పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యే కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని డీఎస్పీ రామంజినాయక్ సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో సీసీటీఎన్ఎస్ పీసీలతో, యూఐ/పీటీ కేసులపై సీసీటీఎన్ఎస్ డేటాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అన్ని వివరాలు సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయడం ద్వారా కేసులు, వ్యక్తుల పూర్తి సమాచారం తెలుస్తుందన్నారు. అరెస్టు సమాచారం, దర్యాప్తు పురోగతి అందరికీ ఉపయోగపడేలా ఉంటుందన్నారు. నేరం చేసిన వారికి శిక్ష పడేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై, ఐసీజేఎస్, ఐటీఎస్ఎస్ఓల గురించి వివరించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని కోర్టు బెయిలబుల్, నాన్ బెయిలబుల్ వారెంట్‌లను, ఎగ్జిక్యూట్ బెయిలబుల్, నాన్ బెయిలబుల్ వారెంట్‌లను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో అప్‌డేట్ చేయాలన్నారు.

రసాయనాలతో ఆహారం విషతుల్యం


మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

ఆత్మకూరు: రసాయన ఎరువులతో పండించే ఆహార ఉత్పత్తులు విషతుల్యమవుతున్నాయని ఏడీఏ ఆంజనేయ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం వెలుగు సిబ్బంది, వ్యవసాయశాఖ అనుబంధ శాఖల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికపై ఏఓ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి ఏడీఏ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మరల్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారిణి చందన, ఎస్ఆర్‌పీ నరేంద్రగౌడ్, ఎన్ఎఫ్ఏ నాగరాజు పాల్గొన్నారు.

● **బండి ఆత్మకూరు:** అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగంతో భూసారం తగ్గుందని జిల్లా వ్యవసాయ అధికారి వైవీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక మహిళా మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతి తదితరులు పాల్గొన్నారు. అలాగే బండిఆత్మకూరు, ఈర్నపాడు, కడమల కాలువ గ్రామాల పరిధిలో అకాల వర్షానికి దెబ్బ తిన్న పంటలను పరిశీలించారు.

● **కొత్తపల్లి:** రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను పండించడంతోపాటు ఆర్థికపరంగా అభివృద్ధి సాధించవచ్చని డిస్ట్రిక్ రిసోర్స్ సెంటర్ నంద్యాల ఏవో హేమలత, మండల వ్యవసాయాధికారి కె. మహేష్, మాస్టర్ ట్రైనర్ మహబూబ్ బాషా సూచించారు. మంగళవారం వెలుగు సమావేశ భవనంలో ఏర్పాటు ఏసిన సమావేశంలో వారు మాట్లాడారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి


పోషణ పక్వాడ్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మహిళలు గర్భ దాల్చినప్పటి నుంచి కాన్పు అయ్యేవత వరకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి చిరంజీవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని శివపురం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మహిళల చేత ర్యాలీ నిర్వహించారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్ట్

మహానంది: గోస్పాడు మండలం జూలెపల్లెకు చెందిన వడ్డె రామపుల్లయ్యపై హత్యాయత్నం చేసిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మహానంది ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డితో కలిసి ఆయన మంగళవారం నిందితుల వివరాలు వెల్లడించారు. మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన షేక్ మెహతాజ్ రాంపుల్లయ్యతో వెళ్లి మదనపల్లెలో ఉన్న విషయం తెలుసుకున్న ఆమె తండ్రి, బంధువులు మదనపల్లెకు వెళ్లి ఆమెతో కలిసి కారులో వస్తున్న క్రమంలో పథకం ప్రకారం రాంపుల్లయ్యను అంతమొందించాలనే ఉద్దేశంతో ఫిబ్రవరి 22న మహానంది సమీపంలోని శ్రీనగరం వద్ద రాత్రి 11 గంటల సమయంలో అరటితోటలోకి తీసుకెళ్లి రాళ్లతో కొట్టి, కత్తితో పొడిచి పడేసి వెళ్లారన్నారు. దీంతో మహానంది పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా విచారణ చేసి రామపుల్లయ్యపై దాడిచేసిన మెహతాజ్ తండ్రి కరిముల్లా, ఆమె భర్త రసూల్, తల్లి ఫాతిమాబీ, మెహతాజ్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు వివరించారు.

సంరక్షణపై శ్రద్ధ వహించాలి


మాట్లాడుతున్న ఏసీడీపీఓ మంగవల్లి

పాములపాడు: చిన్నారుల సంరక్షణపై శ్రద్ధ వహించాలని ఏసీడీపీఓ మంగవల్లి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో పోషణ్ పక్వాడాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపంతో ఉన్న 59 నెలలలోపేఉ పిల్లల బాగోగులను కమ్యూనిటీ స్థాయిలో నిర్వహించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. లబ్ధిదారులు తామంతట తామే పోషణ ట్రాకర్‌లో నమోదు చేసుకునే విధానంపై ప్రచారం చేయాలన్నారు. కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం, పిల్లల్లో పోషకాహార లోపం నివారించాలన్నారు. ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లలితప్రభావతి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం బుచ్చయ్య మాట్లాడుతూ మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాటి జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. సీహెచ్‌సీ వైద్యులు సోహైల్ మాట్లాడుతూ మత్తుపదార్థాలకు బానిసలైతే ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. ర్యక్రమంలో ఈగల్ క్లబ్ సభ్యులు పూర్ణేశ్వరరెడ్డి, ఇందిరా ప్రియదర్శిణి, డాక్టర్ ఎం.పద్మ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శివనాగిరెడ్డి, అధ్యాపకులు మహేశ్వరరెడ్డి, బాలు, కళ్యాణి, రజాక్, నాగరాజు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్ కేంద్రం ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: పట్టణంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం కొణిదేల రోడ్డులో ఉన్న జీవనోపాదుల భవనంలో కుట్టు శిక్షణ పొందుతున్న కేంద్రాన్ని మెప్మా సీఎంఎం శాంతకుమారి పరిశీలించారు. ఈక్రమంలో ఆమెకు సీపీఐ (ఎంఎల్) నాయకులు వినతి పత్రం అందజేశారు. పార్టీ నాయకురాళ్లు లక్ష్మీదేవి, అరుణమ్మ, రజియా, రామలక్ష్మి, పావని, రూబియా పాల్గొన్నారు.

వైద్యంపై పేదలకు నమ్మకం కలిగించాలి

నందికొట్కూరు: పేదలకు ప్రభుత్వ వైద్యశాలలో అందిస్తున్న వైద్యంపై నమ్మకం కలిగించాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. మంగళవారం బ్రాహ్మణకొట్కూరు ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నవ్వుతూ రోగులను పలకరించి వైద్యం అందించాలన్నారు. విధుల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బెల్లంఊట ధ్వంసం

ఆత్మకూరు: మండల పరిధిలోని ఇందిరేశ్వరగూడెంకు దాదాపు 4 కి.మీ. దూరంలోని అటవీ ప్రాంతలో మంగళవారం 2,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

నందికొట్కూరు: పీఎంఏవై 2.0 పథకం కింద పక్కా గృహానికి దరఖాస్తు చేసుకున్న వారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించాలని మిడుతూరు హౌసింగ్ ఏఈ భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణ స్థల ధ్రువీకరణ పత్రాలతోపాటు కుల, ఆదాయ పత్రాలు అందజేయాలన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

పగిడ్యాల: శ్రీరామనవమి తిరునాలను పురస్కరించుకుని మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సీనియర్ విభాగం ఎడ్ల బండలాగుడు పోటీలు అట్టహాసంగా సాగాయి. పోటీలను ముచ్చుమరి ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు.

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

పాములపాడు: ప్రధాన మంత్రి సూర్య ఘర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్ కో ఏడీ రామసుబ్రహ్మణ్యం, మండల ప్రత్యేకాధికారి రాజు సూచించారు. మంగళవారం స్థానిక ఎస్సీ కాలనీలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ ప్యానెల్ ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితమని, ఇతరులకు సబ్సిడీపై అందించనున్నామని తెలిపారు. ఇందుకోసం బ్యాంకుల నుంచి రుణాలు అందించనున్నట్లు చెప్పారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గృహ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన దానిని యూనిట్ రూ.2.90 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, కరెంటు బిల్లుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ రంగనాయక్ పాల్గొన్నారు.

హంసవాహనంపై శ్రీలక్ష్మీరంగనాథుడు


దేదీప్యమానంగా వెలుగొందుతున్న శ్రీలక్ష్మీరంగనాథస్వామి

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం స్వామి వారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలతో అలంకరించి సహస్రనామార్చన, కుంకుమార్చన, పుష్పార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారిని అలంకరించిన పల్లకీలో ఆశీనులను చేశారు. గోవింద నామస్మరిస్తూ బోయీలు స్వామివారి పల్లకీని మోస్తూ ఉత్సవ రథం వరకు తెచ్చారు. హంసవాహనంతో అలంకరించిన గ్రామోత్సవ రథంపై స్వామివారిని కూర్చుంబెట్టి గోవిందా నామాన్ని స్మరిస్తూ జయ జయ ధ్వానాల మధ్య రథాన్ని పురవీధుల్లో తిప్పారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు, ఊది బత్తీలు, మంగళ హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి బుధవారం శేషవాహనసేవ నిర్వహించనున్నట్లు పూజారి ఈశ్వరరెడ్డి, చైర్మన్ నారాయణరెడ్డి, ఈఓ సాయికుమార్ తెలిపారు.

ఆశా కార్యకర్తను విధుల్లోకి తీసుకోవాలి


వైద్యాధికారికి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకురాళ్లు

ఆత్మకూరు: రాజకీయ ఒత్తిళ్లతో తొలగించిన బండిఆత్మకూరు పీహెచ్‌సీ కొత్తపల్లి గ్రామ ఆశా కార్యకర్త ఎం.విమలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు భారతి, శాంతి మంగళవారం వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్న ఆశా కార్యకర్తను తొలగించి తమ వారికి ఇప్పించుకోవాలన్న స్వార్థంతో కూటమి నేతలు వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు లింగమ్మ, సుజాతబాయి, హసీన, వెంకటేశ్వరమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.

● **జూపాడుబంగ్లా:** బండిఆత్మకూరు మండలం కొత్తపల్లి పీహెచ్‌సీ ఆశా వర్కర్ విమలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు ఏసురత్నం, కర్ణ కోరారు. మంగళవారం జూపాడు బంగ్లా పీహెచ్‌సీ ఆశావర్కర్లతో కలిసి డాక్టర్ సభాకు, పారుమంచాల పీహెచ్‌సీ ఆశావర్కర్లతో కలిసి డాక్టర్ యశ్వినికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు భారతి, జయమ్మ, లక్ష్మీదేవి, ప్రమీల, రాణెమ్మ, సావిత్రమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పోటీలు


పోటీలను తిలకిస్తున్న జనం

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన పొట్టేళ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. 13 పొట్టేళ్లు తలపడగా పగిడ్యాల మండలం ప్రాతాకోట లోకేష్ పొట్టేలు విజేతగా నిలిచింది. రెండవ స్థానంలో పగిడాల ధీర పొట్టేలు, మూడో స్థానంలో మిడుతూరు మండలం రోళ్లపాడు అంజి పొట్టేలు, నాల్గవ స్థానంలో పాములపాడు రవి పొట్టేలు నిలిచాయి. పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు బహుమతులు అందజేశారు.

ఘనంగా పారువేట ఉత్సవం


పారువేటకు పల్లకీలో బయలుదేరిన ఉత్సవమూర్తులు

పగిడ్యాల: స్థానిక లక్ష్మీచెన్నకేశవ స్వామి తిరునాలను పురస్కరించుకుని మంగళవారం పారువేట ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా పురోహితులు ఉత్సవ మూర్తుల విగ్రహాలను పల్లకీలో కొలువుంచి మేళతాళాలతో ఊరేగిస్తూ పారువేట కట్టకు చేరుకున్నారు. అనంతరం అక్కడ స్వామివారికి విశేష పూజల అనంతరం ఆలయం వద్దకు చేర్చారు.

డిజిటల్ పరివర్తనపై అంతర్జాతీయ వెబ్‌నార్

నందికొట్కూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో డిజిటల్ పరివర్తనపై అంతర్జాతీయ వెబ్‌నార్ నిర్వహించారు. యూఎస్ఏ, జర్మనీ, యూరప్ దేశాల నుంచి వక్తలు వివిధ అంశాలపై ప్రసంగించారు. జర్మనీలోని ఎస్ఆర్‌హెచ్ విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ గణేష్ తొట్టెంపూడి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ అంశంపై ప్రసంగించారు. విశ్వక్‌సేనుడు లాజిస్టిక్ కో ఆర్డినేటర్ ట్రాన్స్‌కామ్ కంపెనీ, లిథువేనియా, యూరప్ స్థిరమైన ఆవిష్కరణ, లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్‌లో ఆటో మేషన్ అంశంపై వివరించారు. యూఎస్ఏలోని న్యూయార్క్‌లోని టైగర్ అనలిటిక్స్‌లో డేటా విశ్లేషకుడిగా పని చేస్తున్న రామకృష్ణారెడ్డి ఆధునిక వ్యాపారంలో డేటా విశ్లేషణ అంశంపై మాట్లాడారు. వెబ్‌నార్‌లో అధ్యాపకులు పరిమళదేవి, ఝాన్సీరాణి, రవి, అన్వర్ హుసేన్, రంగముని పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ కార్యక్రమం


విద్యార్థులను సర్టిఫికెట్, మెడల్స్‌తో సన్మానించిన పాఠశాల యాజమాన్యం

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో మంగళవారం కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవ అజీష్‌జార్జ్ హాజరై మాట్లాడారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో డిపాల్ స్కూల్ ప్రిన్సిపాల్ షిన్స్, వైస్ ప్రిన్సిపాల్ వినీత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వండి

జూపాడుబంగ్లా: ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన పథకం 2.0 కింద ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న వారు నిర్ణీత ధ్రువీకరణ పత్రాలను వారంలోగా తమ కార్యాలయంలో అందజేయాలని హౌసింగ్ ఏఈ జ్యోతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1,098 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు తహసీల్దార్ మంజూరు చేసిన ఇంటినిర్మాణ స్థల ధ్రువీకరణపత్రం (పొజిషన్ సర్టిఫికెట్) వారంలోగా అందజేస్తే గృహమంజూరు, నిర్మాణ వర్క్‌ఆర్డర్ కాపీలను ఇస్తామన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

మహానంది: వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. తిమ్మాపురం ఆస్పత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు.

● **మహానంది:** మండల పరిధిలోని అరటి తోటలను మంగళవారం ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

● **మహానంది:** అర్హులైన ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తున్నట్లు అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం తిమ్మాపురం కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

● **మహానంది:** సోలార్ రూఫ్ టాఫ్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని తెలిపారు. తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీఓ మహబూబ్ దౌలాలతో సమావేశం నిర్వహించారు. అలాగే పంచాయతీ కార్యదర్శులతో ఎంపీపీ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్‌కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 9న తంగడంచ, తాటిపాడు, 10న తర్తూరు, జూపాడుబంగ్లా-2, 11న మండ్లెం-1 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బాలఆధార్ నమోదుతోపాటు స్కూల్, కాలేజీ విద్యార్థులు, గ్రామస్తులు ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు ఉంటే చేయించుకోవాలన్నారు. ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువకుడికి గాయాలు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని మణికంఠపురం గ్రామానికి చెందిన ఈరన్న (18) విద్యుదాఘాతానికి గురై గాయాలపాలయ్యాడు. కోత మిషన్‌కు విద్యుత్ తీగలు అడ్డు వస్తున్నాయని తప్పించేక్రమంలో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. యువకుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.